క్లుప్తంగా

గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ సంఘమేశ్వరరావు

పెళ్లకూరు: చవితి సందర్భంగా గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతులు తప్పనిసరి అని నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వర రావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, గణేష్ విగ్రహాలు ఏర్పాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలు వివరించారు. డీజే సౌండ్స్‌కు ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు లేవని స్పష్టం చేశారు. నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ నాగరాజు ఉన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

ఓజిలి: గ్రామాల్లో నెలకొంటున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీఓ కిరణ్మయి పేర్కొన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయాన్ని మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రీసర్వేలో ఏ సమస్యలున్నా వెంటనే వారిని పరిష్కరించాలన్నారు. గ్రీవెన్స్ సెల్‌కు వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి సాగుచేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈమె వెంట తహసీల్దార్ పద్మావతి, డీటీ మధుసూదన్‌రాజు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

పెళ్లకూరు: మండల కేంద్రంలోని చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి రోజు చేపట్టే ఉచిత వైద్య పరీక్షలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత అవసరం



విద్యార్థులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

ఓజిలి: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ సుభాషిణి పేర్కొన్నారు. మండలంలోని అత్తివరం ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు టీకాలను వేశారు. ఆమె మాట్లాడుతూ ఐదు రోజుల పాటు ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 50 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఇమునైజేషన్ టీకాలు వేశామన్నారు. ఇళ్లు, పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభణాకుమారి, ఏఎన్‌ఎం కుసుమకుమారి, ఆశా పాల్గొన్నారు.

గ్రామాల్లో స్నేహపూర్వకంగా మెలగాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివ శంకర్

దక్కిలి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్ఐ శివ శంకర్ తెలిపారు. మండలంలోని ఎగువమార్లగుంటలో సోమవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ గ్రామస్తులతో మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసైతే ఆరోగ్య సమస్యలకు గురి కావాల్సి వస్తుందన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించినట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

బార్‌కు దరఖాస్తుల స్వీకరణ

వెంకటగిరి (సైదాపురం): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన కొత్త బార్ల ఏర్పాట్లలో వెంకటగిరికి మంజూరైన బార్‌ను దక్కించుకునే వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ తిరుపతి జిల్లాల్లో 27 బార్లు కేటాయించగా అందులో వెంకటగిరి మున్సిపాలిటీకి ఒక బార్ కేటాయించినట్లు తెలిపారు. బార్‌ను దక్కించుకునేవారు రూ.55 లక్షలు 6 విడతల్లో చెల్లించాలని తెలిపారు. ఆసక్తి కలిగి 21ఏళ్లు పైబడిన వారు నాన్‌రిఫండబుల్ రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు చెల్లించాలని సూచించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో బార్‌ను లాటరీ పద్ధతులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 28వ తేదీన ఉదయం 8 గంటలకు తిరుపతిలో లాటరీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రతిభ చాటితే భవిత మీదే!

- విద్యార్థి విజ్ఞాన మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- 6 నుంచి 11వ తరగతి వరకు విద్యార్థులకు అవకాశం
- ఎంపికైతే స్కాలర్‌షిప్, ప్రఖ్యాత పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్
- దరఖాస్తుకు గడువు సెప్టెంబర్ 15



తీర్థంపాడు హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు

దక్కిలి: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు వారిలో దాగిన సృజనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఎన్‌సీఈఆర్‌టీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్సు మ్యూజియం, విజ్ఞాన భారతి సంయుక్తంగా విద్యార్థి విజ్ఞాన మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల వరకు ఈ పరీక్ష రాయడానికి అర్హులే. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి భారతదేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుంది. ఇందుకు గాను 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది.

దరఖాస్తుల ఆహ్వానం

విద్యార్థి విజ్ఞాన మంథన్ ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తిగల విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా, సెప్టెంబర్ 30 తేదీ వరకు గడువు ఉంటుంది. ఈ పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6 నుంచి 11 (ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం) తరగతుల వరకు విడివిడిగా ఈ పరీక్ష ఉంటుంది. విద్యార్థుల ఆసక్తిని బట్టి తెలుగు, హిందీ, ఇంగ్లీషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష రాయవచ్చు. విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వీవీఎం.ఓఆర్‌జీఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వవచ్చు.

వంద మార్కులకు పరీక్ష

ఈ పరీక్షకు సంబంధించి మాక్ పరీక్షలను సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నిర్వహిస్తారు. పాఠశాల స్థాయి, ప్రధాన పరీక్ష అక్టోబర్ 28వ తేదీ నుంచి 30 తేదీ వరకు ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైన వారికి సెకండ్ లెవెల్ (ద్వితీయ పరీక్ష) పరీక్ష ఆన్‌లైన్‌లో ప్రొక్టరింగ్ విధానంలో పరిశీలకుల సమక్షంలో నవంబర్ 19వ తేదీ నిర్వహిస్తారు. పై రెండు పరీక్షలు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 90 నిమిషాల పాటు (గంటన్నర) రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి ఒకసారి మాత్రమే యాప్‌లో లాగిన్ కాగలరు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. లెవల్–1 ప్రధాన పరీక్షలో ప్రతి తరగతికి సంబంధించిన వంద ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్–ఏలో విజ్ఞాన శాస్త్రంలో భారతీయ మేధావుల కృషిపై 20, సత్యేంద్రనాథ్ బోస్ జీవిత చరిత్రపై 20, సెక్షన్‌లో 6 నుంచి 11 తరగతుల విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల నుంచి 50, లాజిక్ రీజనింగ్ నుంచి 10 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో ఉత్తీర్ణులైన వారికి లెవల్ టు (ద్వితీయ పరీక్ష)లో 50 ప్రశ్నలు ,100 మార్కులు ఉంటాయి.

రాష్ట్ర స్థాయికి ఎంపిక ఇలా...

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతులు వారీగా ప్రతిభ చూపిన మొదటి 25 మందిని ఎంపిక చేస్తారు. 6–11 తరగతులకు గాను మొత్తం 150 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు వంతున 18 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2వేలుతో పాటు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేస్తారు. రాష్ట్ర స్థాయి విజేతల్లో ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల చొప్పున 12 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడ ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థులకు 18 మందిని విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు వరుసగా రూ.25వేలు, రూ.15 వేలు, రూ.10వేలుతో పాటు జ్ఞాపిక, .ప్రశంసాపత్రంతో పాటు నెలకు రూ.2000 చొప్పున ఏడాది పాటు భాస్కర ఉపకార వేతనం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన మంథన్ 2025–26లో జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీఓ, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్‌సీ తదితర జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1–3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

పింక్ బస్ క్యాంప్ రేపు

దక్కిలి: స్విమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ గురువారం స్థానిక పీహెచ్‌సీలో పింక్ బస్ సేవలు అందించనున్నట్లు వైద్యాధికారిణి బిందు ప్రియాంక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇక్కడికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ తీసుకురావాలని కోరారు.

వాకాడు పోలీస్ స్టేషన్ తనిఖీ

వాకాడు : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం గూడూరు డీఎస్పీ గీతా కుమారి తనిఖీలు నిర్వహించారు. ఆమె స్టేషన్‌లోని పలు పెండింగ్ కేసులకు సంబంధించి రికార్డులు పరిశీలన చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

వెంకటగిరి రూరల్ : విద్యుత్ సరఫరాలో బుధవారం అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ డీఈ ముని రవిచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పాతబస్టాండ్, గాజులవీధి, బజారువీధి, రాజావీధి, తూర్పు వీధి, దక్షిణపు వీధుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలనున్నట్లు తెలిపారు.

హుండీ రాబడి రూ.26 లక్షలు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి శక్తిస్వరూపిణి పోలేరమ్మతల్లి ఆలయం హుండీ కానుకలు రూ.26,17,483 లక్షలు వచ్చినట్లు ఈఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2 నుంచి ఈ నెల 19వ తేదీ వరకు సంబంధించి పట్టణంలోని పాతకోట శ్రీరామ మందిరంలో నగదు లెక్కించినట్లు తెలిపారు.

సాగునీటి కాలువ ఆక్రమణపై ఫిర్యాదు



డీటీ యువరాజ్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరు చెరువుకు చావలి సప్లయ్ చానల్ ద్వారా సాగునీరు సరఫరా చేసే వ్యవసాయ కాలువ ఆక్రమణలను తొలగించి క్రమబద్ధీకరించాలని మంగళవారం పలువురు రైతులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ యువరాజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. 71వ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా చిల్లకూరు వడ్డిపాళెం సమీపంలో ఉన్న వ్యవసాయ కాలువను ఆక్రమించడం వల్ల సాగునీరు సరఫరా కావడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.రబీ సీజన్‌కు సాగునీరు చెరువుకు సరఫరా చేసేలా వ్యవసాయ కాలువను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కందమూడి శివకుమార్ తోపాటు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ర్యాలీలో ఫొటో, వీడియో గ్రాఫర్లు

నాయుడుపేటటౌన్ : ప్రపంచ ఫొటోగ్రాఫీ దినోత్సవ వేడుకలను పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఫొటో, వీడియో గ్రాఫర్లు గాంధీపార్కు వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడ నుంచి పాత బస్టాండు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని డీఎస్ఆర్ కల్యాణ మండపంలో సీనియర్ ఫొటో, వీడియో గ్రాఫర్లను సన్మానించారు.

వెంకటగిరి రూరల్ : పట్టణ పరిధిలోని ఫొటో, వీడియో స్టూడియో అధినేతల ఆధ్వర్యంలో సీనియర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించారు. యూనియన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు.

కొలతలు విధిగా నమోదు చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

ఓజిలి: కూలీలు చేసిన కొలతలను ఎప్పటికప్పుడు తప్పనిసరిగా నమోదు చేసి బిల్లులు మంజూరయ్యేలా చూడాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని సగుటూరు పంచాయతీలో ఉపాధి హామీ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి కూలీకి వంద రోజులు పనులు కల్పించాలన్నారు. ఒక కూలీ రోజుకు రెండు మీటర్లు పొడవు, రెండు మీటర్లు వెడల్పు, అడుగు లోతు పని చేస్తే వారికి రూ.307 నగదు గిట్టుబాటు అవుతుందన్నారు. అనంతరం గ్రద్దగుంట పంచాయతీ జోష్యులవారికండ్రిగలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈమె వెంట ఈసీ సుబ్రమణ్యం, ఏఎఫ్ఏ అశోక్ ఉన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

చిల్లకూరు: గూడూరు పట్టణంలో గణేష్ ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు హెచ్చరించారు. పట్టణ సీఐ కార్యాలయంలో, సత్ప్రవర్తన కలిగి ఉండాలని రౌడీ షీటర్లకు సూచించారు. చవితి ఉత్సవాల్లో నిబంధనలను కఠినతరం చేశామని, హద్దుమీరితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ తిరుపతయ్య ఉన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

చిల్లకూరు: మోటారు కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే జీవో నెంబర్ 21, 31,ను వెంటనే రద్దు చేయాలని తిరుపతి జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తం రెడ్డి, శివ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆటో కార్మికులతో కలసి మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ ఏఓ శిరీషకు వినతి పత్రం అందజేశారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

కోట: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, గిరిజన కాలనీల్లో బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపైనా చర్యలు ఉంటాయని ఐసీడీఎస్ సీడీపీఓ మునికుమారి సూచించారు. గూడలిలోని కొండమిట్ట గిరిజన కాలనీలో మంగళవారం బాల్య వివాహాలపై కలుగు అనర్థాలపై మహిళలకు అవగాహన కలిగించారు. గిరిజనులు తాము కూలీలుగా జీవిస్తున్నా పిల్లలను కష్టపడి చదివించాలని సూచించారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, కోటేశ్వరి పాల్గొన్నారు.

కోలాహలం.. గ్రామోత్సవం



మండల పరిధిలోని తంబుగారిపాలెం గ్రామంలో కొలువైన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం కోలాహలంగా గ్రామోత్సవం నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు విశేష అలంకరణ గావించి కల్యాణాన్ని జరిపించారు. ఉదయం బాణసంచా, మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. తమ ఇంటి ముంగిటకు వచ్చిన స్వామి, అమ్మవార్లకు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

– చిట్టమూరు

రోడ్డుపై గుంతలు పూడ్చివేత



విద్యానగర్‌లో గుంతల రోడ్లను పూడ్చి పనులు చేయిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కోట: విద్యానగర్ నుంచి గూడలి వరకు ప్రధాన రహదారి గుంతలమయంగా ఉన్న విషయమై 'సాక్షి' పత్రికలో గుంతల రోడ్లతో అవస్థలు శీర్షికన వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో గుంతలను పూడ్చివేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

సీసీపై చర్యలు

కలువాయి(సైదాపురం): మండలంలోని వెలుగు కార్యాలయంలో అనధికారికంగా విధులు నిర్వర్తిస్తున్న సీసీ పుల్లయ్యను వెంటనే అనంతసాగరంలో వెళ్లి విధులను నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజు కుమారి ఆదేశించారు. అనధికారికంగా కలువాయిలో విధులు నిర్వహిస్తున్న వ్యవహారంపై 'బదిలీ అయినా కుర్చీ వదలని సీసీ' అన్న శీర్షికన ఈ నెల 9వ తేదీన ప్రచురితమైన కథనానికి పీడీ స్పందించారు. ఈ విషయమై ఏపీఎం రవిని పీడీ వివరణ కోరారు. అనంతసాగరంకు వెళ్లి విధులను నిర్వర్తించకపోతే కఠినమైన చర్యలు తీసుకుంటామని పీడీ హెచ్చరించారు. సీసీగా పాపారావు విధులను నిర్వర్తిసారని పీడీ పేర్కొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



దొరవారిసత్రం: మండల కేంద్రంలోని బీసీ గురుకుల కళాశాలలోని విద్యార్థులకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం సహకారంతో నవజీవన్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి, నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తిరుపతయ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీకాలు



కలువాయి(సైదాపురం): మండల కేంద్రంలోని పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈ నెల 23వ తేదీ వరకు నిరంతరంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఎన్‌ఎం చంద్రసుధ, ఎంఎల్‌హెచ్‌పి షారుణ్ తెలిపారు.

నీట్ పీజీ ఫలితాల్లో ప్రతిభ

కలువాయి(సైదాపురం) : కలువాయికి చెందిన అల్లంపాటి సుబ్బారెడ్డి కుమార్తె అల్లంపాటి వైష్ణవిరెడ్డి సోమవారం విడుదల అయిన నీట్ పీజీ ఫలితాల్లో 6,900 ర్యాంక్ సాధించారు. వైష్ణవికి ఉత్తమ ర్యాంకు రావడంపై తల్లిదండ్రులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

చీటీల పేరుతో మోసం

వెంకటగిరి రూరల్ : చీటీల పేరుతో ఓ వ్యక్తి తమను మోసం చేశారని పట్టణానికి చెందిన పలువురు బాధితులు మంగళవారం వెంకటగిరి ఎస్ఐ ఏడుకొండలకు ఫిర్యాదు చేశారు. బాధితులు మాట్లాడుతూ పట్టణంలోని సాలికాలనీకి చెందిన అరూరు వెంకటేశ్వర్లు చీటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు పట్టణ పరిధిలోని సాలె(కాలనీ, ఎన్టీఆర్‌కాలనీ, మల్లమ్మగుడి, కుమ్మరిగుంట) ప్రాంతాల్లో పలువురి నుంచి వసూలు చేసిన రూ.50 లక్షలతో వెంకటేశ్వర్లు అదృశ్యమైనట్లు బాధితులు వాపోయారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలియజేశారు.

చికెన్ ధరలు		20-8-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	120
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	220
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	244
లేయర్ చికెన్	:	200

వరికి పచ్చ పురుగు తెగుళ్ల బెడద

దక్కిలి: వరి సాగులో పచ్చ పురుగు బెడద అధికంగా ఉందని దాని నివారణకు తగు చర్యలు తీసుకోవాలని వ్యసాయశాఖ అధికారిణి శిరీషా రైతులకు సూచించారు. మండలంలోని వడ్ల మోపూరు నడింపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ, అనుబంధల శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంట వేసే ప్రతి రైతు విధిగా ఈ–పంట నమోదు సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా చేయించుకోవాలన్నారు. ఈ–పంట నమోదు ద్వారానే వ్యవసాయశాఖ ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రాని రైతులు తగు పత్రాలతో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఓ శివకుమార్ పాల్గొన్నారు.

కలుపును నివారించుకోవాలి

సైదాపురం: రైతులు కలుపు మొక్కలను నివారించుకోవాలని ఏఓ హైమావతి సూచించారు. మండలంలోని పొలూరు, అనంతమడుగు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరిసాగులో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. నిమ్మ తోటలు సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు.


అక్రమ కేసులు బనాయించి భయపెడతారా?



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు: కూటమి ప్రభుత్వంలోని పెద్దలు అక్రమ కేసులు బనాయిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులను బెదిరింపులకు పాల్పడే చర్యలు మానుకోవాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఎద్దేవా చేశారు. గూడూరులోని సనత్ నగర్‌లోని నివాసంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే చిల్లకూరు మండలం వైఎస్సార్‌సీపీ వైస్ ఎంపీపీ వేమారెడ్డి కుమార్ స్వామి రెడ్డి, ఆయన తల్లి మోమిడి ఎంపీటీసీ శారదమ్మలపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. జమీందారీలుగా ఉన్న వేమారెడ్డి కుటుంబీకులపై ఇప్పటివరకు ఎలాంటి కేసులు లేవని, నేడు కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం శోచనీయమన్నారు. ఆయన వెంట గూడూరు పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ బొమ్మిడి శ్రీనివాసులు, నాయకులు పూర్ణ సుభాన్ పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ సమీపంలో వ్యక్తి మృతి



షేక్ షబ్బీర్(ఫైల్)

నాయుడుపేటటౌన్: పట్టణంలోని భరత్ నగర్ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన చెట్ల మధ్య షేక్ షబ్బీర్(46) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడాన్ని మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. భరత్ నగర్‌లో భార్య, ఇద్దరి పిల్లలతో కలిసి షేక్ షబ్బీర్ నివాసం ఉంటున్నాడు. కారు డ్రైవర్‌గా పనిచేసే షబ్బీర్ మద్యం అతిగా తాగి వస్తుండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఈ నెల 14వ తేదీ నాడు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. వెళ్లిన రోజే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చారిత్రక శిథిలాలు లభ్యం



ఆలయ పరిసరాల్లో లభించిన శిథిలాలు

కోట : మండలంలోని చిట్టేడులో మంగళవారం గూడూరు ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాల బీఏ గ్రూపు విద్యార్థులు, అధ్యాపకుడు గోవిందు సురేంద్ర ఆధ్వర్యంలో జరిపిన పరిశోధనల్లో పలు చారిత్రక శిథిలాలు లభ్యం అయ్యాయి. చిట్టేటమ్మ ఆలయ పరిసరాల్లో గతేడాది ఎస్‌కేఆర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల బృందం క్రీ.శ 1678 నాటి శాసనం కనుగొన్నట్లు తెలిపారు. ఈ రోజు ఆ శాసనం కనుగొన్న ప్రాంతంలో వివిధ ఆకారాల్లో కుండ పెంకులు, ఆ నాటి మానవులు ఉపయోగించిన రాతి వస్తువులు లభించాయన్నారు. ఈ రోజు జరిపిన పర్యటనలో వినాయకుడి ప్రతిమ, పురాతన బావి, కోనేరు చిట్టేటమ్మ ఆలయానికి చుట్టూ గల పొలాల్లో ఉండడాన్ని గుర్తించామన్నారు.

నోటీసులు ఇచ్చారు.. పింఛన్‌లు నిలిపివేశారు



ఆందోళన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

బాలాయపల్లి(సైదాపురం) : గత 20 ఏళ్ల నుంచి వస్తున్న పింఛన్లను కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చిన రెండేళ్లకే కడుపు కొట్టిందని మంగళవారం కన్నీళ్లు పెట్టుకున్నారు. మండలంలోని కడగుంట గ్రామానికి చెందిన వారు మాట్లాడుతూ దివ్యాంగులమైన తమకు, వస్తున్న పింఛన్ నిలిపివేస్తున్నట్లు నోటీసులు ఇచ్చి నిలిపివేశారన్నారు. దీంతో ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని చెప్పారు.